ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-10.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ గా తీర్చిదిద్దాన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

2. దేశ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఉద్దేశించిన రోజ్ గార్ మేళా లో భాగంగా రేపు ఉదయం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పలువురికి నియామక పత్రాలు అందజేస్తారు. హైదరాబాద్ లో జరిగే రోజ్ గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొంటారు.

3. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కనీసం 30 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జీ+వన్ నిర్మాణానికి అనుమతి ఇస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

**4.** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. 22 జిల్లాలకు ప్రాంతీయ వాతావరణ కేంద్రం పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

**శ్రీధర్ బాబు**

తెలంగాణను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటీ , పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా మెల్‌బోర్న్‌లోని ప్రముఖ యూనివర్సిటీ - RMIT తో రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ)ను కుదుర్చుకుందని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్ , పరిశోధన, అభివృద్ధి, ఉన్నత విద్య, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాల్లో ద్వైపాక్షిక సహకారానికి ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. రేపటి జీనోమ్ వ్యాలీకి ఇది ఒక బ్లూ ప్రింట్‌గా మార్గనిర్దేశం చేస్తుందన్నారు. ఆసియాలోనే అగ్రగామిగా ఎదిగిన తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థను 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. త్వరలోనే ప్రత్యేకంగా తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

**పీఎస్**

**రోజ్ గార్ మేళా**

దేశ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఉద్దేశించిన రోజ్ గార్ మేళాను రేపు ఉదయం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లో జరిగే కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొంటారు. ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తారు. దాదాపు వంద మందికి ఈ సందర్భంగా ఆఫర్ లెటర్లు అందజేస్తారు.

**- ఎంఎస్ఎల్**

**ఇందిరమ్మ ఇళ్లు**

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఇరుకు స్థలాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు పక్కా ఇంటి వసతిని కల్పించేలా ఇందిరమ్మ పథకాన్ని వర్తింప చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కనీసం 30 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జి ప్లస్ వన్ తరహాలో ఇంటిని నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్థలం ఉన్న వారికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తోంది. అయితే, ఇల్లు కనీసం 400 చదరపు అడుగులు.. గరిష్ఠంగా 600 చదరపు అడుగులు ఉండాలని షరతు విధించింది. అయితే, గ్రౌండ్‌ఫ్లోర్‌లో 400 చదరపు అడుగుల నిర్మాణం చేపట్టలేని ప్లాట్లలో.. జీ ప్లస్ వన్ పద్ధతిలో కట్టుకునేందుకు ప్రభుత్వం సడలింపు ఇచ్చింది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో రూఫ్ నిర్మించాక లక్ష రూపాయలు , మొదటి అంతస్తు రూఫ్ లెవెల్ వరకు కాలమ్స్ నిర్మించాక మరో లక్ష రూనపాయలు , గోడలు నిర్మించాక 2 లక్షల రూపాయలు , నిర్మాణం పూర్తయ్యాక మిగతా లక్ష రూపాయలు విడుదల చేస్తారు.

పీఎస్

**HYD**

ఘట్ కేసర్ లో నిన్న రాత్రి గో రక్షా కార్యకర్తపై జరిగిన కాల్పుల సంఘటనను నిరసిస్తూ హైదరాబాద్ పోలీస్ డైరెక్టర్ జనరల్ కార్యాలయం వద్ద ఈ ఉదయం భారతీయ జనతా పార్టీ ఆందోళన చేపట్టింది. దీంతో డీజీపీ ఆఫీస్ వద్ద భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు డీజీపీ ఆఫీస్ వద్దకు చేరుకోగా , పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ముట్టడికి యత్నించిన బీజేపీ కార్యకర్తలను కూడా పోలీసులు నిలువరించారు. కాగా, గాయపడ్డ కార్యకర్తను ఆసుపత్రిలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపి లక్ష్మణ్, తదితరులు కొద్ది సేపటి క్రితం పరామర్శించారు. ఇలాంటి సంఘటనలు దురదృష్టకరమని ఈ సందర్భంగా వారు అన్నారు.

పిటిసి, హైదరాబాద్

**దామోదర్**

సంగారెడ్డి జిల్లాలో ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు వీలైనత తొందరగా పూర్తి చేయాలిన వైద్య , ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల పంచాయత్ రాజ్ , R & B శాఖల ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించిన మంత్రి... మండల కేంద్రాల నుండి గ్రామాలకు వెళ్లే కనెక్టింగ్ రోడ్ల పనులు కూడా త్వరగా పూర్తి చేయాలనీ మంత్రి ఆదేశించారు.

పిటిసి, సంగారెడ్డి

**స్క్రూటినీ**

హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఉపఎన్నిక నామినేషన్ల ప్రక్రియలో భాగంగా పరిశీలన పూర్తి అయింది. మొత్తం 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లు దాఖలు చేయగా, 81 మంది అభ్యర్థులకు చెందిన 135 నామినేషన్లను మాత్రమే ఆమోదించారు. వివిధ కారణాల వల్ల 130 మంది అభ్యర్థులు వేసిన 186 నామినేషన్లను తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణకు రేపటి వరకు అవకాశం ఉంది. బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాపై రేపు పూర్తి స్పష్టత రానుంది.

**పీటీసీ, హైదరాబాద్**

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

గడచిన 20 నెలల్లో ప్రజాపాలన సుమారు 75 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ లో నిన్న విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... సింగరేణి కాలరీస్ , డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ సహకారంతో దాదాపు 200 కంపెనీలతో హుజూర్ నగర్ లో ఎల్లుండి మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని అన్నారు.

బైట్.... ఉత్తం కుమార్ రెడ్డి

పిటిసి, నల్గొండ

**వరంగల్ సీపీ**

సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. పోలీస్ జాగృతి కళా బృందం నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. వరంగల్ పోలీస్ కమీషనరేట్ లో పోలీస్ జాగృతి కళా బృందం సభ్యులతో కమిషనర్  సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో ప్రజలకు సైబర్ నేరాలు , రోడ్ సేఫ్టీ, మూడ నమ్మకాలు, షీ టీం, డయల్ 100, మత్తు పదార్థాలపై అవగహనకు, గ్రామీణ ప్రజలకు అర్థమయ్యే రీతిలో కథాంశాలతో ప్రదర్శనలు ఇవ్వాలన్నారు.

పిటిసి, వరంగల్

**జీఎస్టీ**

జీఎస్టీ 2.0 ద్వారా రియల్ ఎస్టేట్ రంగం మళ్ళీ పుంజుకుంటోందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నరసింహరావు ఆకాశవాణికి తెలిపారు. జీఎస్టీ తగ్గించడం వల్ల సిమెంట్  ,  ఇసుక,  ఇటుక,  టైల్స్ ధరలు తగ్గాయని.. దీంతో ప్రజలు ఇళ్ళు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు.

**బైట్ - నరసింహారావు**

**పీటీసీ, భద్రాద్రి**

**కపాస్ కిసాస్ యాప్**

కపాస్ కిసాన్ యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని వరంగల్ ఉద్యానవన శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాష సూచించారు. ఎనుమాముల మార్కెట్ లో పత్తి కొనుగోళ్ల పరిశీలించిన ఆమె అధికారులకు , రైతులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి సందేహాలు ఉన్న మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు.

పిటిసి, వరంగల్

**నిషా ముక్త్ అభియాస్**

మాదక ద్రవ్య రహిత సమాజం లక్ష్యంగా కరీంనగర్ జిల్లాలో నషా ముక్త్ భరత్ అభియాన్ ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కూతడి తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ తిరుపతి ఆకాశవాణితో మాట్లాడుతూ....

బైట్ ... తిరుపతి

పిటిసి, కరీంనగర్

**వాతావరణం**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ లో ఈ ఉదయం అక్కడక్కడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈ రోజు అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది , ఈమేరకు ఆయా జిల్లాలకు పసుపురంగు హెచ్చరిక జారీ చేసింది.

**పీఎస్**

**దండారి**

ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన దండారి ఉత్సవ వేడుకలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం సాకడ గ్రామంలో నిర్వహించిన దండారి ఉత్సవాల్లో నిన్న రాత్రి జిల్లా ఏఎస్పి చిత్తరంజన్ , స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైనూరు మండలం బూసి మెట్ట , సిర్పూర్ మండలం పిట్టగూడా గ్రామాలలో నిర్వహించిన వేడుకల్లో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదివాసీల తో కలిసి ఎమ్మెల్యే నృత్యం చేశారు.

**పీటీసీ, ఆసిఫాబాద్**

**వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో నిన్న రాత్రి శాశ్వత ఆకాశ దీపాన్ని వెలిగించారు. ఆలయం ఆవరణలోని గండా దీపం పైన ఏర్పాటుచేసిన ఈ ఆకాశదీపం నెల రోజుల పాటు నిరంతరాయంగా వెలుగుతూనే ఉంటుందని అర్చకులు తెలిపారు. మరోవైపు.. భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక కార్తీక దీపం ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రతి రోజు సాయంత్రం సుహాసినీల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతుందని, ఆలయ ఈవో రమాదేవి తెలిపారు.

**పీటీసీ, సిరిసిల్ల**

**ఆది శ్రీనివాస్**

ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన ప్రతి దాన్యం గింజను కొనుగోలు చేస్తామని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా , వట్టెముల, గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతులు

దళారులకు ధాన్యం విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధరను పొందాలన్నారు.

పిటిసి, సిరిసిల్ల

**"కిసాస్ కాపాస్"**

ఆసిఫాబాద్ జిల్లా, మోతుగూడలో జిల్లా వ్యవసాయ అధికారులు "కిసాన్ కాపాస్" యాప్ పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... రైతులు స్లాట్ బుకింగ్ చేసుకున్నాకే తమ పత్తిని సంబంధిత సీసీఐ జిన్నింగ్ మేలుకు తీసుకువెళ్లాలని సూచించారు.

పిటిసి, ఆసిఫాబాద్

**ప్రభాతభేరి**

సమాజంలోని వివిధ రుగ్మతలను రూపుమాపి , ప్రజలలో పరివర్తన తీసుకవచ్చే దిశగా ప్రభుత్వం ప్రారంభించిన 'ప్రభాతభేరి' కార్యక్రమంలో భాగంగా సృజనాత్మకమైన రచనలను , కళారూపాలను ఆహ్వానిస్తున్నట్లు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు నర్సింహారెడ్డి తెలియజేశారు. పాట, స్కిట్, ఏకపాత్ర, వీధి నాటిక, చిందు యక్షగానం, షార్ట్ ఫిలిం, బుర్రకథ, హరికథ, గేయ రూపకం, బ్రీత్ లెస్ సాంగ్ , ఫ్లాష్ మాబ్ లేదా ఇతర కళారూపాల ద్వారా సమాజంలో మార్పును తీసుకువచ్చే దిశగా ఈ కార్యక్రమం కింద ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని కళాకారులు , కవులు, సాహితీవేత్తలు వచ్చేనెల 10వ తేదీ లోపు తమ రచనలు, కళారూపాలను హైదరాబాద్ రవీంద్రభారతిలోని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో అందించాలని కోరారు.

**పీఎస్**

**స్నో లెపర్డ్ డే**

ఈరోజు అంతర్జాతీయ స్నో లెపర్డ్ డే (మంచు చిరుతపులుల దినోత్సవం)ను జరుపుకుంటున్నారు. మంచు చిరుతపులుల సంరక్షణ , వాటిని కాపాడటం గురించి అవగాహన కల్పించడానికి ఈరోజు అంకితం చేయబడింది. మంచు చిరుతపులుల వంటి అంతరించిపోతున్న జంతువులను రక్షించడం, వాటి జీవనోపాధిని కాపాడటం ఈ రోజు యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

డెస్క్

**భాయ్ దూజ్**

ఇవాళ ఉత్తరాది రాష్ట్రాల్లో భాయ్ దూజ్ పండుగను జరుపుకుంటున్నారు. అదే విధంగా దక్షిణాది రాష్ట్రాల్లో భగినీ హస్త భోజనం పండుగను జరుపుకుంటున్నారు. భగినీ అంటే.. సోదరి అని అర్థం. అంటే.. ఇవాళ సోదరి వండి పెట్టే భోజనాన్ని సోదరులు తినాలి. ఇదో మంచి సంప్రదాయం. సోదరులు.. సోదరి ఇంటికి వెళ్లి.. భోజనం చేసి.. ఆమెకు ఒక చీర , రవికను బహుకరించాలి. ఇది వారి మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని చెబుతారు.

డెస్క్

**ఐటీ**

జెనరేటివ్ ఏఐతో రూపొందించిన కృత్రిమ కంటెంట్ (డీప్‌ఫేక్స్ , సింథటిక్ కంటెంట్) నుంచి యూజర్లకు రక్షణ కల్పించే దిశగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) నిబంధనలను సవరించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా 'ఐటీ నిబంధనలు 2021 'కి కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ పలు సవరణలను ప్రతిపాదించింది. వీటి ప్రకారం అసలు , నకిలీ కంటెంట్‌కి మధ్య వ్యత్యాసాన్ని యూజర్లు సులువుగా గుర్తించేందుకు వీలుగా సింథటిక్

కంటెంట్‌కి లేబులింగ్ , మార్కింగ్ చేయాల్సిన బాధ్యత సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై ఉంటుంది.

**డెస్క్**

**యూపీఐ**

దీపావళి పండుగ సీజన్ లో డిజిటల్ చెల్లింపులు సరికొత్త రికార్డులు స్రుష్టించాయి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ( UPI) లావాదేవీలు మునుపెన్నడూ లేనంతగా పెరిగి ఆల్-టైమ్ రికార్డును సాధించాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( NPCI) విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. దీపావళి పండగకు ముందు రోజు యూపీఐలో ఒక్కరోజే 74 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయి.

**డెస్క్**